AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
13-8-2026 (Thursday) MAIN EDITION

## మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో ఫోన్ లభ్యం



**అక్షరటుడే, బెంగళూరు :** అత్యాచార కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న జనతా దళ్ (సెక్యులర్) మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ.. తాను ఉన్న బెంగళూరు జైలులో మొబైల్ ఫోన్‌తో దొరికాడు. క్రైమ్ బ్రాంచ్ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీలో రేవణ్ణ ఫోన్ వాడుతూ కనిపించారు. రేవణ్ణ ఆండ్రాయిడ్ ఫోన్, ఛార్జర్, పెన్ డ్రైవ్, డైరీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అధికారులు జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈరన్న రంగపూర్‌ను సస్పెండ్ చేశారు. మరో అధికారికి నోటీసులు జారీ చేశారు. అనంతరం ప్రజ్వల్‌ను వీఐపీ గది నుంచి సాధారణ బ్యారక్‌కు తరలించారు.

## రాయదుర్గం భూముల వేలం ఆపాలి : హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రాయదుర్గం భూముల వేలం ఆపాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాయదుర్గంలోని సర్వే నెం. 83/1లో ఉన్న 10.63 ఎకరాల భూమికి సంబంధించి ఆగస్టు 17, 21 తేదీలలో జరగాలన్న టీజీఐఐసీ ప్రతిపాదిత వేలాన్ని తక్షణమే నిలిపి వేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. సర్వే నెం. 83ను వారసత్వ ప్రదేశంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్‌బీఐ, వక్ఫ్ హక్కులకు సంబంధించిన యాజమాన్య వాదనలు ఇప్పటికే న్యాయ పరిశీలనలో ఉన్నాయన్నారు.

### రీల్స్ పిచ్చితో సర్జరీ : షకీల



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అతిగా మొబైల్ ఫోన్ ఉపయోగించడం వల్ల ప్రముఖ నటి షకీల తీవ్రమైన ఆరోగ్య సమస్యను ఎదుర్కొన్నారు. ఫోన్ వాడకం ఎక్కువైపోవడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, చివరకు రూ.3 లక్షలు వెచ్చించి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె స్వయంగా అభిమానులతో పంచుకున్నారు.

### అమరావతి రైతుల త్యాగం గొప్ప స్ఫూర్తి



**అక్షరటుడే, ఏపీ :** రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన అమరావతి రైతులు చేసిన త్యాగం గొప్ప స్ఫూర్తి అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. రాజధానిలో 'ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్', బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

### ఈసీ అధికారులపై ప్రకాశ్ రాజ్ ఆగ్రహం



**అక్షరటుడే, కర్ణాటక:** ఎస్ఐఆర్‌లో భాగంగా నటుడు ప్రకాశ్ రాజ్ ఓటు తొలగింపు అంశంపై వివాదం ఇంకా కొనసాగుతోంది. ప్రకాశ్ రాజ్ ఓటును నిబంధనల ప్రకారమే మార్చామని, ఆయన ఫారమ్-6 సమర్పించి ఓటు హక్కును తిరిగి పొందవచ్చని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## వాయిదాలతోనే ముగిసిన సభ



**పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ముగిశాయి. ఎలాంటి చర్చలు లేకుండా ఆందోళన మధ్య సభలు సాగాయి. సమావేశాల కంటే వాయిదాలే ఎక్కువగా కొనసాయిగాయి. ఎలాంటి చర్చ లేకుండానే ప్రభుత్వం పలు బిల్లులను ఆమోదించగా.. నీట్ పేపర్ లీకేజీ, అయొధ్య విరాళాల చోరీ, విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా విపక్ష ఎంపీలు సభను అడ్డుకున్నారు. చివరి రోజు సైతం ఉభయసభల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, నిరసనల మధ్యనే వాతావరణం వేడెక్కింది. పరస్పర ఆరోపణలతో సభలు దద్దరిల్లాయి.** - అక్షరటుడే, ఢిల్లీ

■ పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ముగింపు ■ విపక్షాల నిరసనలతో సాగని సభ ■ ఆఖరి రోజు కూడా నిరసనల హోరు

పార్లమెంట్ సమావేశాల్లో గురువారం ఉదయం మూడు నిమిషాల పది సెకన్ల సమయం, సమావేశాల్లో లోక్‌సభ చూసిన ప్రశాంతమైన సమయం కావచ్చు. సభ సమావేశమై వందేమాతర గీతం వినిపించింది, మరియు ప్రధాన మంత్రితో సహా సభ్యులు గౌరవ వందనం చేశారు. అనంతరం స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. హోం మంత్రి అమిత్ షా లోక్‌సభకు చేరుకోగానే, "క్షమాపణ చెప్పండి, క్షమాపణ చెప్పండి", "లాఠీఛార్జ్‌కు ఎవ రు ఆదేశించారు?" అని ప్రతిపక్ష నేతలు నినాదాలు చేయడం ప్రారంభించాయి. అందరినీ తమ స్థానాల్లో కూర్చోమని షా సైగ చేయగా, దానికి ప్రతిస్పందనగా అధికార పక్ష ఎంపీలు గందరగోళం సృష్టించారు. అనంతరం మోదీ సభకు వచ్చారు. వందేమాతరం గీతం అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు.

### నీట్ అంశంతో..

వర్షాకాల సమావేశాలలో నీట్ పేపర్ లీకేజీ అంశంపై విపక్షాలు సభను అడ్డుకున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అది నెరవేరగా అయోధ్య అంశం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు అమిత్ షా సమాధానం చెప్పాలని సభను అడ్డుకున్నాయి. తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి ప్రశ్నకు సమాధానమిస్తానని షా బుధవారం అన్నారు. విద్యార్థుల సమస్యపై చర్చ ప్రారంభించేందుకు ప్రతిపక్షాలతో సంప్రదించి సమయం కేటాయించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. ఈ ప్రతిపాదనను ప్రతిపక్షాలు తిరస్కరించాయి. ఆ తర్వాత అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం ప్రారంభించాయి. దీంతో సమావేశాల్లో చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది.

### తేనీటి విందుకు డుమ్మా

సభ అనంతరం స్పీకర్ తేనీటి సమావేశానికి ఇండియా బ్లాక్ ఎంపీలు హాజరు కాలేదు. ప్రధానమంత్రితో సహా సీనియర్ ఎన్డీఏ నాయకులు స్పీకర్ టీ సమావేశానికి హాజరు కాగా, ఇండియా బ్లాక్ నాయకులు దూరంగా ఉన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌లను ఈ సమావేశానికి హాజరు కావాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కోరారు.

### 11 బిల్లులకు ఆమోదం

సమావేశాల్లో లోక్‌సభ 11 బిల్లులను ఆమోదించింది, కానీ పేపర్ లీక్‌ల చట్టం మినహా, మిగిలిన వన్నీ ఎలాంటి చర్చ లేకుండా గందరగోళం మధ్య హడావిడిగా ఆమోదించబడ్డాయి. ప్రతిపక్షాల నినాదాల మధ్య, చాలా సందర్భాల్లో అక్షరాలా నిమిషాల వ్యవధిలోనే వాయిస్ ఓటు ద్వారా బిల్లులు ఆమోదం పొందాయి. పేపర్ లీక్‌లపై కొత్త చట్టాన్ని ఆమోదించే ముందు లోక్‌సభ దానిపై సుమారు 11 గంటల పాటు చర్చించగా, మిగిలిన బిల్లులపై ఎలాంటి చర్చ జరగలేదు. ఇందులో జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, సుప్రీం కోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు కూడా ఉన్నాయి.

## అకాలీదళ్ చీఫ్‌పై కత్తులతో దాడి

**అక్షరటుడే, నాందేడ్:** శిరోమణి అకాలీ దళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై దాడి జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో అకాలీదళ్ అధినేత, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడికి పాల్పడ్డారు. అక్కడి ఒక గురుద్వారాను సందర్శించిన తర్వాత నగర శివార్లలో బాదల్‌పై ఈ దాడి జరిగింది. ఒక నిహంగ్ సిక్కు వ్యక్తి 'కిర్పాన్' (సిక్కుల సంప్రదాయ కత్తి)తో బాదల్‌పై దాడి చేశారని సమాచారం. దాడి జరిగిన వెంటనే బాదల్‌ను నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో బాదల్ భద్రతా సిబ్బందిలో ఒకరు కూడా గాయపడ్డారు.



## విపక్షాలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం

**అక్షరటుడే, ఢిల్లీ :** కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విపక్ష ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకపోవడంపై మండిపడ్డారు. కొత్త ఎంపీలకు విపక్ష సభ్యులు ఏం నేర్పిస్తున్నారని ప్రశ్నించారు. నినాదాలు రోడ్లపై చేయాలి.. పార్లమెంట్‌లో కాదన్నారు. గతంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తూనే చర్చల్లో పాల్గొనేవన్నారు. కానీ వీరు మాత్రం ప్రతిపక్ష పాత్రలో ఉంటూనే చర్చకు దూరంగా పారిపోయారని విమర్శించారు. ముఖ్యంగా లోక్‌సభలో.. ప్రతిపక్షం చర్చకు దూరంగా ఉండడం ఇదే మొదటిసారి అన్నారు.

## రాజ్యసభలో ఖర్గే ప్రసంగ వివాదం..



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి రోజు రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఉత్తరాఖండ్‌లో తాను పాల్గొన్న ర్యాలీ ముగిసిన తర్వాత కొందరు వేదిక వద్ద శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడంపై ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాను మాట్లాడిన ర్యాలీకి లక్షలాది మంది ప్రజలు హాజరయ్యారని ఆయన చెప్పారు. ‘‘నేను ఎక్కడా ఏ మతాన్ని, ఏ వర్గాన్ని కించపరిచేలా మాట్లాడలేదు. కేవలం ప్రజల సమస్యల గురించే ప్రస్తావించాను. కానీ, నేను మాట్లాడిన స్థలంలో కొందరు శుద్ధి కార్యక్రమం చేపట్టారు’ అని ఆయన అన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు

## ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు : మంత్రి పొన్నం




**అక్షరటుడే, హైదరాబాద్:** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’ పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

## జూరాలకు తగ్గిన వరద..

**అక్షరటుడే, గద్వాల :** ఎగువన కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కృష్ణనది పరీవాహక ప్రాంతంలో వానలు తగ్గడంతో జూరాల ప్రాజెక్ట్‌కు వరద తగ్గింది. ప్రాజెక్ట్‌కు ప్రస్తుతం 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో గేట్ల ద్వారా నీటివిడుదలను అధికారులు నిలిపివేశారు. విద్యుత్ ఉత్పత్తి, ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో 10 యూనిట్లతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి సైతం ఇన్‌ఫ్లో తగ్గింది బుధవారం 51,296 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా గురువారానికి 26,939 క్యూసెక్కులకు తగ్గింది. సాగునీరు, తాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తుండటంతో, అవుట్ ఫ్లో 71,176 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తిస్థాయి నీటి మట్టం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 185.56 టీఎంసీల నీరు నిల్వ ఉంది.






## టాటా సన్స్ ఛైర్మన్ ఎంపికపై ట్రస్ట్ కీలక ప్రకటన

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** టాటా సన్స్ ఛైర్మన్‌గా మరోసారి కొనసాగకూడదని ఎన్ ఛైర్మన్ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దీంతో కొత్త ఛైర్మన్ ఎంపికపై టాటా ట్రస్ట్ కీలక ప్రకటన చేసింది. ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ నుంచి నామినీ డైరెక్టర్లకు ఈ మెయిల్ వచ్చిందని ట్రస్ట్ తెలిపింది. 2027 ఫిబ్రవరి 20న ముగియనున్న తన ప్రస్తుత పదవీకాలం తర్వాత, ఛైర్మన్‌గా తిరిగి నియమితులయ్యేందుకు తాను ఆసక్తి చూపడం లేదని తన నిర్ణయాన్ని తెలియజేశారు. ఆయన నిర్ణయాన్ని సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ గౌరవిస్తుందని తెలిపింది. దశాబ్ద కాలంలో టాటా సన్స్, టాటా గ్రూప్‌లకు ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపింది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు కొత్త ఛైర్మన్‌ను సిఫార్సు చేసేందుకు, టాటా సన్స్ 'ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్' (నియమావళి) ప్రకారం వీలైనంత త్వరగా ఒక ఎంపిక కమిటీని ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించాలని ట్రస్టీలు తీర్మానించారు.

## ఏసీబీ కస్టడీకి డీఎస్పీ భీమ్‌రెడ్డి

**అక్షరటుడే, హైదరాబాద్ :** అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. రెండు రోజుల పాటు ఆయనను ప్రశ్నించనున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు గతంలో భీమ్‌రెడ్డి నివాసాల్లో సోదాలు చేశారు. భారీగా అక్రమాస్తులను గుర్తించారు. జులై 7న ఆయనను కోర్టులో ప్రవేశ పెట్టగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనంతరం ఆయనను కస్టడీకి అప్పగించాలని నాంపల్లి ఏసీబీ కోర్టులో అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం రెండు రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో గురువారం ఉదయం ఏసీబీ అధికారులు ఆయనను కస్టడీకి తీసుకున్నారు.






## యూరియా కోసం కాళ్లు మొక్కిన రైతు

**అక్షరటుడే, మెదక్ :** యూరియా కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. బస్తా యూరియా దొరకక అవస్థలు పడుతున్నారు. నిత్యం ఎరువుల దుకాణాలు, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. మెదక్ జిల్లా కౌల్చారం మండలం రంగంపేటలో ఓ రైతు యూరియా కోసం సొసైటీ సిబ్బంది కాళ్ల మీద పడ్డాడు. ఎలాగైనా రెండు బస్తాల యూరియా ఇవ్వాలని వేడుకున్నాడు. తనకు ఆన్‌లైన్‌లో బుక్ చేయడం రాదని ఎవరి పేరు మీద అయినా ఇప్పించాలని కోరారు. కావాలంటే అధిక ధర చెల్లిస్తానని వాపోయాడు. అయినా సదరు సొసైటీ అధికారి తాను ఏమి చేయలేనని చెప్పి చేతులు ఎత్తేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.